ఏడో విడత ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభం

న్యూఢిల్లీ, మే 7: ఇప్పటికే దేశంలో మూడు దశలు పూర్తి చేసుకున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏడో, ఆఖరి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. జూన్ 1న జరిగే ఈ ఎన్నికల్లో 57 సీట్లకు పోలింగ్ జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గానికి ఈ విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు మే 14 ఆఖరి తేదీ.

బీజేపీ డౌట్.. మార్కెట్ డౌన్

- మూడు దశల పోలింగ్‌లో భారీగా తగ్గిన ఓటింగ్
- బీజేపీకి 200 సీట్లు దాటబోవన్న వార్తలకు బలం
- ఆర్థికరంగ నిపుణుల అంచనాలు కూడా ఇలాగే
- దీన్ని ధ్రువపరుస్తూ 18% చేరువకు వీఐఎక్స్ ఇండెక్స్
- మదుపర్లలో భయాలు షురూ.. పెట్టుబడులు వెనక్కి
- మార్కెట్లలో కల్లోలం.. 18 రోజుల్లో 20 లక్షల కోట్లు ఆవిరి

ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి భారీగా సీట్లు తగ్గనున్నాయా?
మూడు దఫాల్లో తగ్గిన పోలింగ్ శాతాన్ని బట్టి..
మోదీ పరివారానికి 200 సీట్లు కూడా వచ్చే అవకాశం లేదా?
అందుకే దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయా?
దలాల్ స్ట్రీట్‌లో ఏ నిపుణుడిని ప్రశ్నించినా.. 'నిజమే' అన్న సమాధానం వస్తున్నది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళి.. దేశీయ స్టాక్ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. మూడు దశల్లో తగ్గిన ఓటింగ్ శాతాన్ని చూస్తే.. అధికార బీజేపీకి ఈసారి భారీగా సీట్లు తగ్గే అవకాశం ఉందన్న వార్తలు బలపడుతున్నాయి. దీంతో కేంద్రంలో విధాన నిర్ణయాలు మారొచ్చన్న అభిప్రాయాలూ పెరుగుతున్నాయి. ఫలితంగా మదుపర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో మార్కెట్లు కుదేలవుతున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మోదీతో పన్నుల మోత తప్పదనే భయాలు ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు.

తగ్గిన పోలింగ్.. ఆవిరైన సంపద

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించబోతుందన్న నమ్మకం గతంలో మార్కెట్ వర్గాల్లో ఉండేది. అయితే, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఈ అంచనాలు క్రమంగా తారుమారవ్వడం ప్రారంభించాయి. ముఖ్యంగా ఏప్రిల్ 19న జరిగిన తొలి దఫా పోలింగ్‌లో గతంతో పోలిస్తే 4 శాతం ఓటింగ్ తక్కువగా రికార్డయ్యింది. అదే నెల 26న జరిగిన రెండో దశలోనూ గతంతో పోలిస్తే 3 శాతం ఓటింగ్ తక్కువగా నమోదైంది. దీంతో రెండు దశల పోలింగ్ ముగిసిన తరువాత ఎన్డీఏ విజయం అంత కచ్చితం కాకపోవచ్చన్న అంచనాలు మార్కెట్ వర్గాల్లో, మదుపర్లలో పెరుగసాగాయి. దీనికి తోడు బీజేపీకి కీలకమైన ఉత్తరాదిలో మోదీ గ్రాఫ్ పడిపోయిందన్న అభిప్రాయాలు బలపడ్డాయి. మంగళవారం జరిగిన మూడోదఫాలోనూ పోలింగ్ ఆరు శాతం వరకూ తగ్గింది. దీంతో ఈ ప్రభావం మొత్తంగా మార్కెట్‌పై పడింది. దీంతో మంగళవారం ఒక్కరోజే 383.69 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 73,511.85 వద్ద ముగియగా, నిఫ్టీ 140.69 పాయింట్ల నష్టంతో 22,302.5 వద్ద స్థిరపడింది. ఫలితంగా ఒక్క రోజులోనే రూ. 5 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. వెరసి గడిచిన 18 రోజుల్లోనే బీఎస్ ఈలో లిస్టైన కంపెనీలు దాదాపు రూ. 20 లక్షల కోట్ల సంపదను కోల్పోయినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. గత ఐదురోజుల్లోనే సెన్సెక్స్ సుమారు 1500 పాయింట్లు పతనమైనట్టు సమాచారం.

ఇండియా వీఐఎక్స్ సూచీ ఇలా..

ఇండెక్స్ రేంజ్	అర్థం
10-12%	అస్థిరత తక్కువ. చౌకగా ప్రీమియం షేర్ల లభ్యత
16-20%	మార్కెటో అస్థిరత ఎక్కువ.

ఆజ్యం పోసిన ఇండియా వీఐఎక్స్ హెచ్చరికలు

భారత స్టాక్ మార్కెట్లలో అస్థిరతను సూచించే ఇండియా వొలటాలిటీ ఇండెక్స్ (వీఐఎక్స్) గడిచిన 9 సెషన్లలో ఏకంగా 72.69 శాతం పెరిగి.. 17.64 శాతానికి చేరుకొన్నది. ఇది 15 నెలల గరిష్ఠం. ఒకవిధంగా చెప్పాలంటే.. మార్కెట్లలో అస్థిరత్వం ఉన్నదని వీఐఎక్స్ డేంజర్ బెల్స్‌ను మోగించినట్టు భావించవచ్చు. దీంతో అప్రమత్తమైన మదుపర్లు తమ సంపదను వెనక్కి తీసుకోవడం మొదలుపెట్టారు. కొత్త ప్రభుత్వం వస్తే అది తమ పెట్టుబడులపై ప్రభావం చూపించవచ్చని వాళ్లు భావిస్తున్నట్టు మార్కెట్ పండితులు చెబుతున్నారు. మొత్తంగా.. బీజేపీకి ఈ ఎన్నికల్లో సీట్లు తగ్గుతాయన్న వార్తలు బలపడటమే మార్కెట్లో ప్రకంపనలకు కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మోదీ జడుపు మాటలు

హైదరాబాద్, మే 7: పదేండ్ల పాటు అధికారంలో ఉన్న తర్వాత ఎన్నికలకు వెళ్లినప్పుడు.. తన పదవీకాలంలో ప్రజలకు చేసిన మేలు గురించి చెప్పి ఓట్లు అడగాలి. దేశం సాధించిన విజయాలను వివరించి మళ్లీ గెలిపించమని కోరాలి. మా పాలన నచ్చితేనే, మీకు మంచి జరిగితేనే మాకు ఓట్లు వేయండని ప్రజలకు చెప్పే ధైర్యం చేయాలి. కానీ, ప్రధాని మోదీ ప్రచారసరళిని చూస్తే ఇవి కనిపించడం లేదు. కేవలం బీజేపీ గెలవకపోతే ఏదో జరిగిపోతుందని, ఉపద్రవం ముంచుకొస్తుందని ప్రజల్లో భయం, అభద్రతాభావం కల్పించే, ఉద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నం మాత్రమే ఆయన ప్రచారంలో కనిపిస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పదేండ్ల కింద చెప్పిన మాటలనే ఇప్పుడు కూడా చెప్పి ఓట్లు అడుగుతున్నారంటే ఈ పదేండ్ల పాలనలో ఓట్లు కురిపించే గొప్ప పనులేమీ చేయలేదని ఆయన అంగీకరించినట్టు అవుతున్నదని అంటున్నారు. తాజాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు ఉదాహరణగా చెప్తున్నారు.

ఒక్కో దశ పూర్తయిన కొద్దీ పెరుగుతున్న అసహనం

మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ... కాంగ్రెస్ మళ్లీ ఆర్టికల్ 370ని తీసుకురావొద్దంటే, అయోధ్యలో రామాలయానికి బాబ్రీ తాళం వేయొద్దంటే మోదీకి 400 స్థానాలు కావాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వస్తే గతంలో షా బానో కేసు మాదిరిగానే అయోధ్య రామమందిరంపై సుప్రీంకోర్టు తీర్పునూ తారుమారు చేస్తుందని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఎత్తేసి ముస్లింలకు ఇవ్వాలనుకుంటున్నదని పేర్కొన్నారు. అంతేకాదు, రాజ్యాంగాన్ని కూడా మార్చేస్తుందని ఆరోపించారు. ఈ అన్ని ప్రకటనల్లో కేవలం అసహనం, అభూతకల్పనలు, అసాధ్యమైన అంశాలు మాత్రమే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు రామరాజ్యం కావాలో, ఓట్ జిహాద్ కావాలో నిర్ణయించుకోవాలని మరో సభలో పేర్కొన్నారు. మతపరమైన అంశాలను తెరమీదకు తెచ్చి ఓట్లు రాబట్టుకునేందుకే మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ఒక్కో దశ పోలింగ్ పూర్తవుతున్న కొద్దీ ఆయన ఇలాంటి వ్యాఖ్యల తీవ్రతను పెంచుతున్నారని, బహుశా పోలింగ్ సరళిలో సానుకూలత కనిపించడం లేదన్న అనుమానాల వల్లనే ఈ అంశాలను నమ్ముకుంటున్నారేమోనని అభిప్రాయపడుతున్నారు.

విజయంపై అనుమానాలు

ముందు భావించినట్టు.. ఎన్డీఏ సునాయాసంగా గెలుస్తుందని ఇప్పుడు ఎవరూ అనుకోవట్లేదు. దీంతో రిటైల్ ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. అందుకే, మార్కెట్లలో ఒడిదొడుకులు పెరుగుతున్నాయి.

– వీకే విజయకుమార్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్

పరిస్థితులు మారాయ్

ఎన్డీయేదే మళ్లీ అధికారం అన్న ఊహాగానాలకు.. ప్రస్తుత వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దీనికి తోడు ఇండియా వీఐఎక్స్ ఇండెక్స్‌లో భారీగా పెరుగుదల నమోదైంది. దీంతో మార్కెట్లో ఒడిదొడుకులు పెరిగాయి.

– ధనంజయ్ సిన్హా, సిస్టమ్యాటిక్స్ గ్రూప్ ఈక్విటీస్ హెడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్యేలు

సంక్షోభంలో హర్యానా సర్కార్

- మద్దతు ఉపసంహరించుకున్న ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు
- ఇప్పటికే బీజేపీతో జన్‌నాయక్ జనతా పార్టీ తెగదెంపులు
- నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం మైనారిటీలో పడింది: కాంగ్రెస్

ఛండీగఢ్, మే 7: లోక్‌సభ ఎన్నికల వేళ హర్యానా రాజకీయాల్లో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. నాయబ్ సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కష్టాల్లో పడింది. ఇంతకాలం బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ముగ్గురు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు హర్యానా గవర్నర్‌కు లేఖ రాశారు. తాము లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు స్వతంత్ర ఎమ్మెల్యేలు సోంబిర్ సంగ్వాన్, రణ్‌ధీర్ గొల్లెన్, ధరమ్‌పాల్ గొండెర్ ప్రకటించారు. ఈ మేరకు వారు రోహ్‌తక్‌లో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హూడా, హర్యానా పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ సర్కార్ విఫలమైందని, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు తీవ్రమయ్యాయని వీరు ఆరోపించారు.

పార్టీలు మారుతున్న ఎమ్మెల్యేలు

2019లో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకుంది. 10 సీట్లు గెలిచిన జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ), ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఒక హర్యానా లోకిత్ పార్టీ ఎమ్మెల్యే మద్దతుతో ఆ పార్టీ అధికారం చేపట్టింది. ఎన్నికల సీట్ల పంపకాల్లో తేడాలు రావడంతో బీజేపీతో జేజేపీ తెగదెంపులు చేసుకుంది. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు సైతం బీజేపీకి మద్దతు ఉపసంహరించుకున్నారు. అయితే, 10 మంది జేజేపీ ఎమ్మెల్యేల్లో ఇద్దరు బీజేపీకి మద్దతు తెలిపారు. ప్రస్తుతం 88 మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రభుత్వం కొనసాగాలంటే ప్రభుత్వానికి 45 మంది ఎమ్మెల్యేల బలం అవసరం. 40 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు జేజేపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు స్వతంత్రులు, ఒక హర్యానా లోకిత్ పార్టీ ఎమ్మెల్యే మద్దతు ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వానికి ఉంది.

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి: కాంగ్రెస్

బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయిందని, ఒక్క నిమిషం కూడా ముఖ్యమంత్రిగా కొనసాగే హక్కు నాయబ్ సింగ్ సైనీకి లేదని హర్యానా పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్ తెలిపారు. వెంటనే ఆయన రాజీనామా చేయాలని, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ ప్రభుత్వాన్ని దింపేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. జేజేపీ సెక్రటరీ జనరల్ దిగ్విజయ్ సింగ్ చౌతాలా కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హూడాతో చర్యలు జరిపారు.

రాష్ట్రమంతా 25 వేల పెన్‌డ్రైవ్‌లు పంచారు!

సెక్స్ స్కాండల్‌పై జేడీఎస్ నేత కుమారస్వామి ఆరోపణ

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికలకు ముందు హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండెల్ ఆరోపణల కేసుకు సంబంధించి పలువురు మహిళల వీడియోలతో కూడిన 25 వేల పెన్‌డ్రైవ్‌లను రాష్ట్రమంతా పంచారని మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి ఆరోపించారు. ఇందులో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ల కుట్ర ఉన్నదని ఆయన అన్నారు. ఈ కేసు విచారిస్తున్న సిట్‌ను 'సిద్ధరామయ్య, శివకుమార్ ఇన్వెస్టిగేషన్ టీమ్'గా అభివర్ణించారు.

స్పందించిన ఇంటర్‌పోల్!

ప్రజ్వల్‌పై జారీచేసిన బ్లూకార్నర్ నోటీసులకు ఇంటర్‌పోల్ స్పందించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, సిట్ ముందు హాజరయ్యేందుకు ప్రజ్వల్ అడిగిన ఏడు రోజుల సమయం మంగళవారంతో ముగిసింది. అయినా ఆయన విచారణకు హాజరు కాలేదు.

మూడో దశలో 65% పోలింగ్

- అస్సాంలో అత్యధికంగా 81.71 శాతం ఓటింగ్
- ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పం
- పశ్చిమబెంగాల్‌లో ఘర్షణలు

మహారాష్ట్రలోని సాంగ్లీలో పోలింగ్

న్యూఢిల్లీ, మే 7: కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా మంగళవారం లోక్‌సభ ఎన్నికల మూడో దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 65 ఓటింగ్ శాతం నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మూడో విడత ఎన్నికల్లో భాగంగా అస్సాంలో అత్యధికంగా 81.71, ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 57.34 శాతం పోలింగ్ నమోదైందని పేర్కొన్నది. బీహార్, గుజరాత్‌లోనూ దాదాపు 58 శాతం, మహారాష్ట్రలో 61 శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటేశారని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు గుజరాత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

యూపీలో ఎన్నికల అక్రమాలు: ఎస్పీ

పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయి. ముర్షీదాబాద్, జంగిపూర్ నియోజకవర్గాల్లో టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్-సీపీఎం కూటమి కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ముర్షీదాబాద్ నియోజకవర్గంలో అధికార టీఎంసీ భయోత్పాతం సృష్టించిందని సీపీఎం అభ్యర్థి మహ్మద్ సలీం అన్నారు. యూపీలో ఎన్నికల అక్రమాలు జరిగాయని, కొన్ని చోట్ల రిగ్గింగ్ జరిగిందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మెన్‌పురిలోపోలింగ్ కేంద్రాలను తమ అధీనంలోకి తీసుకొనేందుకు బీజేపీ నేతలు ప్రయత్నించారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వాళ్లను పోలీసుస్టేషన్లో నిర్బంధించారని పేర్కొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు సిబ్బంది మృతి

కాగా, కర్ణాటకలో ఎన్నికల్లో విధుల్లో ఉన్న ఇద్దరు ప్రభుత్వ అధికారులు, గుజరాత్‌లోని అమ్రేలి జిల్లాలో 45 ఏండ్ల ఒక మహిళా అధికారి గుండెపోటుతో మరణించారని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి.

మేనల్లుడిని పదవి నుంచి తొలగించిన మాయావతి

లక్నో, మే 7: తన మేనల్లుడు, బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ ఆకాశ్ ఆనంద్‌కు బీఎస్పీ అధినేత్రి మాయావతి షాక్ ఇచ్చారు. ఆయన పూర్తి పరిపక్వత సాధించే వరకు బాధ్యతల నుంచి ఆయనను తప్పిస్తున్నట్టు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గత జూన్‌లో ఆకాశ్‌ను బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్‌గా నియమించారు. అయితే, అనూహ్యంగా ఆయనను తప్పిస్తున్నట్టు ప్రకటించారు.

మూడో ప్రపంచ యుద్ధాన్ని ఆపిన మోదీ: కంగన

న్యూఢిల్లీ, మే 7: మోదీ వల్లే మూడో ప్రపంచ యుద్ధం జరగలేదని సినీ నటి, బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇలా అందరూ ప్రధాని సలహా కోసం చూస్తుంటారని చెప్పుకొచ్చారు. అభినందన్ వర్ధమాన్ పాకిస్థాన్‌కు చిక్కినా, అతడిని రప్పించిన ఘనత మోదీదేనన్నారు.

ఓటింగ్ శాతంలో ఇంత తేడానా?

- పోలింగ్ రోజు చెప్పిన శాతం కంటే తుది రిపోర్టులో భారీగా ఎలా పెరిగింది?
- ఈసీకి తృణమూల్ కాంగ్రెస్ లేఖ
- పూర్తి వివరాల వెల్లడికి డిమాండ్
- కలిసికట్టుగా గొంతెత్తాలన్న ఖర్గే

డెరెక్ ఓబ్రయెన్

న్యూఢిల్లీ, మే 7: మొదటి రెండు దశల్లో పోలింగ్ శాతంలో వ్యత్యాసాన్ని ప్రశ్నిస్తూ ఎన్నికల కమిషన్‌కు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లేఖ రాసింది. పోలింగ్ రోజు ఇచ్చిన రిపోర్టుకు, కొన్ని రోజులకు వెల్లడించిన తుది రిపోర్టుకు పోలింగ్ శాతం భారీగా పెరిగిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ ఈ లేఖలో పేర్కొన్నారు. మొదటి రెండు విడతల్లోనూ ఇదే జరిగిందని తెలిపారు. ఈ రెండు విడతలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్ల సంఖ్య, ఓటు వేసిన వారి సంఖ్య, వినియోగించిన ఈవీఎంలు ఎన్ని, వంటి అన్ని వివరాలను ప్రజల ముందుంచాలని ఈసీని కోరారు. ఓటింగ్ శాతంలో వ్యత్యాసంపై మే 1న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా అనుమానాలు లేవనెత్తారు. పోలింగ్ పూర్తి కాగానే ఈసీ ప్రకటించిన పోలింగ్ శాతం కంటే, తుది నివేదికలో 5.75 శాతం పోలింగ్ పెరిగిందని ఆమె పేర్కొన్నారు. బీజేపీకి తక్కువ ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లోనే పోలింగ్ శాతం పెరిగిందని ఆమె అనుమానాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అందరూ గొంతెత్తాలి: ఖర్గే

ఈసీ విడుదల చేసిన పోలింగ్ శాతంలో వ్యత్యాసాలపై గొంతెత్తాలని కోరుతూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నేతలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం లేఖ రాశారు. మొదటి రెండు దశల్లోని పోలింగ్ సరళి చూశాక ప్రధాని మోదీ, బీజేపీలో కంగారు, నిరాశ కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడుకునేందుకు పోలింగ్ శాతంలో వ్యత్యాసాలపై కలిసికట్టుగా గొంతెత్తాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రతతో పనిచేసేలా చేయడం కోసం ఇండియా కూటమిలోని అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

తొలి రెండు దశల్లో వ్యత్యాసాలు

తొలి దశ సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 19న జరిగాయి. ఆ రోజు రాత్రి 7 గంటల నాటికి దాదాపు 60 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ ప్రకటించింది. అయితే 11 రోజుల తర్వాత ఏప్రిల్ 30న వెల్లడించిన తుది నివేదికలో మాత్రం 66.14 శాతం పోలింగ్ నమోదైనట్టు పేర్కొన్నది. ఏప్రిల్ 26న రెండో దశ పోలింగ్ జరగగా, రాత్రి 7 గంటల నాటికి 60.96 పోలింగ్ జరిగిందని ఈసీ తెలిపింది. ఏప్రిల్ 30న తుది నివేదికలో మాత్రం 66.7 శాతం నమోదైనట్టు వెల్లడించింది. ముందు వెల్లడించిన శాతానికి, తుది నివేదికలో వెల్లడించిన పోలింగ్ శాతానికి ఇంత వ్యత్యాసం ఉండటంపై ఇప్పుడు ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- మధ్యంతర బెయిల్‌పై సుప్రీం తీర్పు వాయిదా
- ఈ నెల 20 వరకు కస్టడీ పొడిగించిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ, మే 7: ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేసుకొనేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సీఎం అయినంత మాత్రాన కేజ్రీవాల్‌ను ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని, బెయిల్ ఇస్తే రాజకీయ నాయకులకు మినహాయింపు ఇచ్చినట్టు అవుతుందని ఎస్‌జీ తుషార్ మెహతా వాదించారు.

బెయిలిస్తే.. సీఎం విధులు నిర్వర్తించొద్దు!

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఒక వేళ ఈ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే, అతను సీఎంగా అధికారిక విధులు నిర్వర్తించకూడదు. ఎందుకంటే ఇది పరస్పర ప్రభావం చూపే అవకాశం ఉన్నది. అయితే తాము ప్రభుత్వ మొత్తం పనిలో జోక్యం చేసుకోవాలనుకోవడం లేదు' అని పేర్కొన్నది. సీఎంగా ఉన్న కేజ్రీవాల్ ఐదేండ్లకు ఒకసారి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని, అతనేమీ తరచూ నేరాలు చేసిన వ్యక్తి కాదని వ్యాఖ్యానించింది.

నిర్దిష్ట తేదీ చెప్పని కోర్టు

ధర్మాసనంలోని న్యాయమూర్తులు బుధవారం వివిధ బెంచుల్లో కూర్చొంటారని.. వీలుని బట్టి బుధవారం లేదా గురువారం లేకుంటే వచ్చే వారం కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణను కొనసాగిస్తామని సుప్రీంకోర్టు పేర్కొన్నది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరుపై తీర్పునకు నిర్దిష్ట తేదీ చెప్పలేదు.

కేజ్రీవాల్, సిసోడియా కస్టడీ పొడిగింపు

మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు జ్యుడిషియల్ కస్టడీ 20 వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సీబీఐ కేసులో సిసోడియా కస్టడీని కూడా ఈనెల 15 వరకు పొడిగించారు.

గుజరాత్‌లో బీజేపీకి ఎదురుగాలి!

- 2019తో పోలిస్తే 6% మేర తగ్గిన ఓటింగ్
- రూపాలా వ్యాఖ్యలతో తిరగబడ్డ క్షత్రియులు
- గత ఎన్నికలతో పోలిస్తే 1-5 సీట్లు తగ్గే ఛాన్స్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో బీజేపీకి ఎదురుగాలి వీచినట్టు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడోదఫాలో భాగంగా మంగళవారం జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం తగ్గడమే దీనికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2019లో గుజరాత్‌లో 64.51 శాతం ఓటింగ్ నమోదవ్వగా.. ఈసారి 6 శాతం తగ్గింది. దీంతో 2014, 2019లో గుజరాత్‌లో మొత్తం 26 లోక్‌సభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన బీజేపీకి.. ఈ ఎన్నికల్లో 1 నుంచి 5 సీట్లు తగ్గవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రూపాలా వ్యాఖ్యలతో..

గుజరాత్‌లో బీజేపీకి క్షత్రియులు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో 17 శాతం ఉన్న రాజ్‌పుత్‌లతో పాటు క్షత్రియులుగా పిలిచే మరికొన్ని ఓబీసీ సామాజిక వర్గాలు ఇందులో ఉన్నాయి. మార్చి 22న ఓ సమావేశంలో కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా రాజ్‌పుత్‌లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బ్రిటిష్ వాళ్లతో ఒకే కంచంలో తినడంతో పాటు వారికి తమ కూతుళ్లనిచ్చి పెండ్లి చేశారని నోరు జారారు. దీనిపై రాజ్‌పుత్‌లు భగ్గుమన్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ నినదించారు. రాజ్‌పుత్ మహిళలు ఆత్మహత్య చేసుకొంటామని బీజేపీ కార్యాలయాల ముందు నిరసనలు చేశారు. 109 క్షత్రియ సంఘాలు ఒక్కటయ్యాయి. వ్యతిరేకతను గుర్తించిన రూపాలా సహా బీజేపీ నేతలు క్షమాపణలు చెప్పారు. ప్రధాని మోదీనే స్వయంగా బుజ్జగింపులకు దిగారు. అయినా క్షత్రియుల అసంతృప్తి కొనసాగుతున్నది. ఇదే తాజా ఓటింగ్‌ను ప్రభావితం చేసి బీజేపీ విజయావకాశాలను దెబ్బతీసినట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చండీగఢ్‌లో పూరీ సీన్

పోటీ నుంచి తప్పుకొన్న ఎస్ఏడీ అభ్యర్థి

చండీగఢ్, మే 7: లోక్‌సభ ఎన్నికల వేళ పంజాబ్-హర్యానా ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ఇటీవల ఒడిశాలోని పూరీలో ముందుగా ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోగా.. తాజాగా అలాంటి సీనే చండీగఢ్‌లో జరిగింది. చండీగఢ్ లోక్‌సభ స్థానం నుంచి శిరోమణి అకాలీదశ్(ఎస్ఏడీ) అభ్యర్థిగా ఉన్న హర్దీప్ సింగ్ పోటీ నుంచి తప్పుకొన్నారు. పార్టీకి కూడా రాజీనామా చేశారు.

జార్ఖండ్ నోట్ల కట్టల కేసు.. కాంగ్రెస్ మంత్రి పీఏ అరెస్టు

రాంచీ, మే 7: జార్ఖండ్‌లో సోదాల్లో లభ్యమైన దాదాపు రూ.35 కోట్ల కేసులో రాష్ట్ర కాంగ్రెస్ మంత్రి ఆలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్, పీఏ ఇంట్లో పనిచేసే పని మనిషి జహంగీర్ ఆలంను ఈడీ మంగ